ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.10 (121.8709)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.66 (2.70)	12.38	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	94.48 (0.39)	50	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.224

కుంభంకే పట్టం



డీసీసీబీ చైర్మన్‌గా ఎన్నికైనట్టు కుంభం శ్రీనివా‌స్‌రెడ్డికి ధ్రువపత్రం అందజేస్తున్న డీసీవో కిరణ్‌కుమార్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- డీసీసీబీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక
- ప్రత్యేక సమావేశానికి హాజరైన 15మంది డైరెక్టర్లు.. ఒకే ఒక్క నామినేషన్ దాఖలు
- చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డిని ప్రకటించిన డీసీవో
- ప్రమాణ స్వీకారంతో పాటు బాధ్యతలు స్వీకరించిన చైర్మన్
- అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పాటు పలువురు నేతలు

నల్లగొండ, జూలై 1: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) నూతన చైర్మన్‌గా మునుగోడు పీఏసీఎస్ చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 28వ తేదీన గత డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై కుంభం శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆయన పదవి కోల్పోయారు. దీంతో నూతన చైర్మన్ ఎన్నికకు జిల్లా సహకార అధికారి నాలుగు రోజుల క్రితం డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. సోమవారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో నూతన చైర్మన్‌ను ఎన్నుకునే ప్రక్రియను నిర్వహించారు. ఉదయం 9గంటలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటికే కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో 14మంది డైరెక్టర్లు డీసీసీబీ కార్యాలయ సమావేశ మందిరానికి చేరుకున్నారు. అనంతరం డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి చైర్మన్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలుకు చివరి సమయం ఉదయం 11గంటల వరకు ఒక్క నామినేషన్ తప్ప ఇతర నామినేషన్లు దాఖలు కాలేదు. దీంతో డీసీసీబీ చైర్మన్‌గా కుంభం శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు డీసీవో కిరణ్‌కుమార్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆ తరువాత తన ఛాంబర్‌లో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదిలా ఉంటే నూతన చైర్మన్ ఎన్నిక కార్యక్రమానికి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు డైరెక్టర్లు హాజరు కాలేదు. నూతన చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి వైస్ చైర్మన్ ఏసీరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, ధనావత్ జయరాం, కోడి సుష్మ, అందెల లింగంయాదవ్, విరిగినేని అంజయ్య, బంటు శ్రీనివాస్, కొండ సైదయ్య, ఎస్.అనురాధ, జూలూరి శ్రీనివాస్, వీరస్వామి, కొమ్ము కరుణ, ఎం.రామచంద్రయ్యతో పాటు పలువురు డైరెక్టర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలిపారు. శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు.

రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం రైతులకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం డీసీసీబీలో నూతన చైర్మన్‌కు అభినందనలు తెలపడంతో పాటు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డీసీసీబీ అధ్యక్షుడిగా కుంభ శ్రీనివాస్‌రెడ్డికి రైతులకు సేవ చేసే అవకాశం కలగడం ఎంతో అదృష్టమన్నారు. నల్లగొండ జిల్లాలో బత్తాయి రైతులతో పాటు అన్ని రకాల పంటలు పండించే రైతులకు సేవ చేయాలన్నారు. డీసీసీబీ ద్వారా గతంలో రూ.1,000కోట్ల విద్యా రుణాలు ఇవ్వడం జరిగిందని, దాన్ని అధిగమించాలని సూచించారు. బ్యాంకును రూ.300కోట్ల అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీకి సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని, రూ.30వేల కోట్ల రూపాయలను మాఫీ చేస్తామన్నారు. గతంలో తమ ప్రభుత్వం దేశవ్యాప్తంగా రూ.70వేల కోట్లను రుణమాఫీ చేసిందన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పు రూ.7లక్షల కోట్లు ఉన్నా, రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నామన్నారు. రైతులకు తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తా : డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

రైతుల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని నూతన చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు ప్రయోజనం చేకూర్చే పనులు చేస్తామన్నారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఉమ్మడి జిల్లాలోని అందరి ప్రజాప్రతినిధులు, నాయకుల సహకారంతో ముందుకు సాగుతామన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు.

గ్రామపాలన గాడితప్పింది

గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పాలన గాడితప్పింది. నిధుల్లేక నిర్వహణ లోపించింది. సకాలంలో వేతనాలందక పోవడంతో మల్టీపర్పస్ వర్కర్లు కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ట్రాక్టర్లకు డీజిల్ లేకపోవడంతోపాటు ఈఎంఐల చెల్లింపు పంచాయతీలకు భారంగా మారంది. సర్పంచులు లేకపోవడం, ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో అన్నీతామై పాలన సాగిస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం పడింది. సుమారు నాలుగు నెలలుగా పంచాయతీల్లో అధికారుల పాలనే నడుస్తోంది. మరోవైపు పదవిలో ఉన్నప్పుడు అప్పు తెచ్చి చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతేగాక ఆందోళనలు నిర్వహిస్తున్నారు.

● ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ



నల్లగొండ జిల్లా రాములబండలో చెత్తను సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు

- నిధుల్లేక నీరసించిన గ్రామ పంచాయతీలు
- 19నెలలుగా అందని రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు
- రెండు త్రైమాసికాల కేంద్రం నిధులూ పెండింగ్
- ఆరు నెలలుగా వేతనాలందక కూలికి వెళ్తున్న మల్టీపర్పస్ వర్కర్లు
- సర్పంచ్‌ల పదవీ విరమణతో ఆర్థిక భారం మీదపడిందంటున్న కార్యదర్శులు
- పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచుల ఆందోళనలు

గ్రామపంచాయతీలకు జనాభా ప్రాతిపదికన కేంద్ర 15వ ఆర్థిక సంఘం నుంచి అభివృద్ధి పనులకు మూడునెలలకోసారి నేరుగా పంచాయతీల ఖాతాల్లో నిధులు జమచేస్తుంది. వీటికి సమానంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. నల్లగొండ జిల్లాలో కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ప్రతీ మూడునెలలకు రూ.19.50కోట్లు వస్తుంటే, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కూడా గతంలో అంతే మొత్తంలో వచ్చేవి. యాదాద్రి జిల్లాకు కేంద్రం నిధులు రూ.11.24కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.13.25కోట్ల చొప్పున వచ్చేవి. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక సంఘం నిధులు నాలుగు నెలలుగా రావడం లేదు. అదేవిధంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు 19 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు విడుదల చేసినప్పుడు ఎస్సీ, ఎస్టీ కోటా నిధులు ఖాతాల్లో వేస్తే, బీసీ, జనరల్ కేటగిరీకి చెందిన నిధులు జమచేయకుండా జాప్యం చేస్తున్నారు. పంచాయతీలకు కీలక నిధులు ఇవే కావడం, అవి సకాలంలో రాకపోవడంతో కనీస నిర్వహణ కరువైంది. ప్రధానంగా ఈ నిధులతోనే ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించడం, మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలివ్వడం, డీజిల్ ఖర్చులు, వీధిదీపాల నిర్వహణ, మోటార్ల మరమ్మతులు, సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టేవారు. ప్రస్తుతం నిధులు నిలిచిపోవడంతో పంచాయతీల్లో తప్పనిసరిగా చేయాల్సిన వీధి దీపాల ఏర్పాటు, డీజిల్ ఖర్చులు, నల్లాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతు వంటి వాటికి ఇంటి పన్నుల నగదుపైనే కార్యదర్శులు ఆధారపడాల్సి వస్తోంది. పింఛన్ల పంపిణీ సమయంలో లబ్ధిదారులను కొంత ఒత్తిడితోనైనా ఒప్పించి ఇంటి పన్ను వసూలు చేసే పరిస్థితి నెలకొంది.

వేతనాలు, ఈఎంఐలకు నిధులు నిల్

సర్పంచ్‌ల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ముగియగా, ప్రత్యేకాధికారుల పాలన అమలులోకి వచ్చింది. అంతకుముందు గత ఏడాది నవంబరు నుంచే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో పంచాయతీలకు నిధుల విడుదల నిలిచింది. దీంతో గత ఏడాది డిసెంబరు నుంచి మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల చెల్లింపులు లేవు. సుమారు ఆరునెలలుగా వీరికి వేతనాలు ఇవ్వడం లేదు. పంచాయతీలు వినియోగిస్తున్న ట్రాక్టర్ల ఈఎంఐలు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పంచాయతీల్లో ఈ సంఖ్య ఎక్కువగా ఉంది. రెండు త్రైమాసికాలకు సంబంధించి ఈఎంఐ చెల్లించని పంచాయతీలకు వాటికి ఫైనాన్స్ చేసిన బ్యాంకుల నుంచి లీగల్ నోటీసులు కూడా వచ్చాయని కొందరు కార్యదర్శులు తెలిపారు. వేతనాలందకపోవడంతో మల్టీపర్పస్ వర్కర్లు కూలి పనులకు వెళ్తున్నారు. దీంతో గ్రామాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనుల నిర్వహణ భారంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు.

మేజర్ పంచాయతీల్లో రూ1.50కోట్ల వరకు పెండింగ్

నల్లగొండ జిల్లాలో మేజర్ పంచాయతీల్లో సుమారు రూ.1.50 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నాయి. చిన్న పంచాయతీల్లోనూ సుమారు రూ.40లక్షల నుంచి రూ.60లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. తిప్పర్తి గ్రామపంచాయతీకి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు రూ.1.05కోట్లు రావాల్సి ఉంది. కేంద్ర ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.20లక్షల వరకు రావాల్సి, మొత్తంగా రూ.1.25కోట్ల మేర పెండింగ్ ఉంది. భారీమొత్తంలో గ్రాంట్లు నిలిచిపోవడంతో పంచాయతీల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఇలాగే కొనసాగితే ప్రస్తుత వర్షాకాలంలో బ్లీచింగ్ పౌడర్ చల్లడం, మురుగుకాల్వలు శుభ్రం చేయడం, చెత్త ఊడ్చడం, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడడం వంటి పనులకూ అవస్థలు తప్పవని, ఉన్నతాధికారులు ఈ అంశాలపై దృష్టిసారించాలని పంచాయతీ కార్యదర్శులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అప్పుచేసి పనులు చేయిస్తున్నాం

సర్పంచ్‌ల పదవీ విరమణ అనంతరం ప్రత్యేకాధికారులను నియమించినా, పంచాయతీల నిర్వహణ భారమంతా తమపైనే పడిందని కార్యదర్శులు చెబుతున్నారు. ప్రధానంగా పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, మోటార్ల మరమ్మతుల వంటి తప్పనిసరి పనులకు రూ.30వేల నుంచి రూ.2లక్షల వరకు సొంతంగా ఖర్చు పెట్టామని, బిల్లులు వస్తే చెల్లిస్తామని మండలాధికారులు చెబుతున్నారని, నెలలుగా బిల్లులు పెండింగ్ ఉండటం, ఇప్పటికే తాహతుకు మించి ఖర్చు చేశామని, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరుతూ సోమవారం నల్లగొండ జిల్లాలో అన్ని మండలాల్లో నిర్వహించిన 'ప్రజావాణి'లో పంచాయతీకార్యదర్శులు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మరో వైపు 'ప్రజావాణి'లో పంచాయతీల నుంచి వీధి దీపాల ఏర్పాటు, నల్లాలు, మోటార్ల మరమ్మతు, పైప్‌లైన్ల లీకేజీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, నిధుల్లేక వాటిని చేయించలేకపోతున్నామని కార్యదర్శులు చెబుతున్నారు. పెండింగ్ బిల్లుల మంజూరుకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని గవర్నర్‌కు మాజీ సర్పంచ్‌లు ఇటీవల వినతిపత్రం సైతం అందజేశారు.



నిధులు విడుదల చేయాలని నల్లగొండ జిల్లా అనుముల మండల 'ప్రజావాణి'లో వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పేదలను ఆదుకోవడమే లక్ష్యం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



'ప్రజాదర్బార్'లో వినతలు తీసుకొని బాధితులతో మాట్లాడుతున్న మంత్రి వెంకట్‌రెడ్డి

నల్లగొండ టౌన్ జూలై 1: పేదలను ఆదుకోవడమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న మునిసిపల్ పార్కులో 'ప్రజాదర్బార్' నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. కలెక్టర్‌ను తన క్యాంప్ కార్యాలయానికి పిలిపించుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదులు పరిష్కరించాలని ఆదేశించారు. వ్యక్తిగత, ఆరోగ్య సమస్యల నిమిత్తం ఆర్థిక సాయం కోరిన వారికి వెంటనే సాయం అందించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీట్ మార్కెట్ కాలనీలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ సబ్‌స్టేషన్‌తో 15,000 కుటుంబాలు లోవోల్టేజీ సమస్యను అధిగమిస్తాయన్నారు. రెండు నెలల్లో సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్, ఇంజనీర్లను ఆదేశించారు. హైదరాబాద్ తరహాలో జిల్లాను అభివృద్ధి చేస్తానన్నారు. 2004లోనే నల్లగొండలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించామని, మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాలకు తాగునీటి కోసం రూ.200కోట్లు కేటాయించామన్నారు. పట్టణంలో రూ.90కోట్లతో నీలగిరి సాంస్కృతిక నిలయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. భూమి ఇస్తే మరో సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపడతామని, టీ-హబ్‌తో పాటు, కలెక్టరేట్ వద్ద మరో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తామన్నారు. పట్టణంలో రానున్న రోజుల్లో ఇబ్బందులు లేకుండా మరో మూడు సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు 10 ఎంఎల్‌డీ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.30కోట్లు మంజూరు చేశామని, రూ.700కోట్లతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. మార్కెట్ ధర కంటే ఎక్కువ పరిహారం ఇస్తామని, ఎస్ఎల్‌బీసీ కాలనీ వద్ద అన్ని వసతులతో మల్టీపర్పస్ హాస్టల్‌ను నిర్మిస్తామన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా వాటిని తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ చంద్రమోహన్, ఆర్డీవో రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి ఉన్నత స్థాయికి ఎదగాలి

నల్లగొండ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్ర సమీపంలోని ఎస్ఎల్‌బీసీలో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదవడం విద్యార్థులు నామోషీగా భావించవద్దన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌సీవో అరుణకుమారి, ప్రిన్సిపాల్ లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో 'ప్రజావాణి'లో మాట్లాడుతున్న కలెక్టర్

ఇక నుంచి పంచాయతీల్లో 'ప్రజావాణి'

కలెక్టర్ నారాయణరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 1: జిల్లాలో వచ్చే గురువారం నుంచి అన్ని గ్రామ పంచాయతీల్లో 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన 'ప్రజావాణి'ని ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రజావాణి' దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదు ఇవ్వాలన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 16 దరఖాస్తులు వచ్చినట్టు ఎంపీడీవో ఉమేష్ తెలిపారు.

ఈ సారైనా 'దశ' మారేనా?

- వానాకాలంపై ఆశ పెట్టుకున్న రైతులు
- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం 9.64 టీఎంసీల నీరు

•7లో..

పోలీస్‌శాఖను ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం



గ్రీవెన్స్‌డేలో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 1: పోలీస్‌శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డే లో వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకొని ఆయన మాట్లాడారు. భూ సమస్యలు, వృద్ధులు, భార్య, భర్తల మధ్య విభేదాలు, ఫైనాన్స్ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి బాధితుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్‌స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలుచేస్తూ వినతులు స్వీకరించాలన్నారు. క్షేత్ర స్థాయి విచారణను వేగవంతంచేసి బాధితులకు సత్వర న్యాయం అందించేలా చూడాలన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. బాధితుల ప్రతీ ఫిర్యాదును 'ఆన్‌లైన్'లో పొందుపరచాలని, నిత్యం పర్యవేక్షణ చేస్తూ తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అమలులోకి నూతన న్యాయ చట్టాలు

దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన న్యాయ చట్టాలు సోమవారం నుంచి అమలులోకి వచ్చాయని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నూతన చట్టాల ద్వారా దర్యాప్తులో వేగం, బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. అమలులోకి వచ్చిన కొత్త చట్టాలు దేశ అంతర్గత భద్రతలో నూతన శకాన్ని ప్రారంభించనున్నాయన్నారు. ఈ చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందన్నారు. ప్రజలకు మరింత వేగంగా సత్వర సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సుసాక్షా అధినీయంపై ఇప్పటికే జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి విడతల వారీగా శిక్షణ ఇచ్చామన్నారు. ఈ మూడు కొత్త క్రిమినల్ చట్టాల్లో సమకాలీన కాలంలో వాడుకలో ఉన్న సాంకేతికతకు అనుగుణంగా పలు కొత్త నిబంధనలు చేర్చడం జరిగిందన్నారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థంగా నిర్వహించడానికి అనుగుణంగా కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించడం జరిగిందన్నారు. వీటి ద్వారా మహిళలకు పూర్తి రక్షణ కలుగుతుందన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయుల బదిలీలు

డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఖుర్షీద్‌మియా

నల్లగొండ, జూలై 1: ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయ బదిలీలు జరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహరించారని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఖుర్షీద్‌మియా సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బదిలీల విషయంలో అక్రమార్కులకు జిల్లా విద్యాశాఖ అధికారి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. స్కూల్ అసిస్టెంట్లు బదిలీ కోరుకునే సందర్భంలో భార్య, భర్తలు ఒకే జిల్లాలో పనిచేయాలనే నిబంధన స్పష్టంగా ఉందన్నారు. అందుకు భిన్నంగా ఇటీవల జరిగిన బదిలీల్లో మిర్యాలగూడలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు స్పౌజ్ సర్టిఫికెట్‌ను ఉపయోగించుకుని అదనంగా 10పాయింట్లు పొంది హైదరాబాద్‌కు దగ్గరగా ఉన్న హైవేపై పాఠశాలను కోరుకున్నాడని తెలిపారు. ఈ విషయం తెలిసినా జిల్లా విద్యాశాఖ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోకుండా తప్పు చేసిన ఉపాధ్యాయుడికి వత్తాసు పలుకుతున్నారన్నారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

స్పౌజ్ దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలి : యూటీఎఫ్

స్పౌజ్ దుర్వినియోగం చేసిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల సైదులు, పెరుమాళ్ల వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పౌజ్ దుర్వినియోగం ద్వారా చిట్యాల మండలం గుండ్రాంపల్లి జడ్పీహెచ్ఎస్‌కు వెళ్లిన ఉపాధ్యాయుడి బదిలీని రద్దు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మిర్యాలగూడ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు ఓ ఉపాధ్యాయుడు స్పౌజ్‌పై పదోన్నతిపై వెళ్లాడన్నారు. గతంలోనే స్పౌజ్‌ను ఉపయోగించుకున్నా, మళ్లీ స్పౌజ్ ఉపయోగించుకుని నిబంధనలకు విరుద్ధంగా గుండ్రాంపల్లికి వచ్చాడని, ఈ విషయంపై రాతపూర్వకంగా డీఈవోకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అక్రమ బదిలీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

రూ.7.14 కోట్ల మేర విద్యుత్ శాఖపై భారం ● బిల్లులో ఎరియర్స్‌గా నమోదు •7లో..

గర్భిణి మృతికి కారకులైన ఆరుగురి అరెస్టు

సూర్యాపేటక్రైం, జూలై 1: ఏడు నెలల గర్భిణికి అబార్షన్ చేసి, ఆమె మృతికి కారణమైన ఆరుగురిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. మొత్తం ఏడుగురు నిందితుల్లో స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు పరారీలో ఉన్నారని తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం భట్టుతండాకు చెందిన భట్టు క్రిష్ణ కుమార్తె సుహాసినిని మే 2019న చివ్వెంల మండలం ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. ఈ సమయంలో రూ.10 లక్షల నగదు, 15 గుంటల వ్యవసాయ భూమి, ఐదు తులాల బంగారు ఆభరణాలు కట్నంగా ఇచ్చారు. సుహాసిని ఏడాది తర్వాత ఆడపిల్లకు, రెండేళ్లకు రెండో కాన్పులోనూ ఆడపిల్లకు జన్మనిచ్చింది. ఇటీవల మరోసారి గర్భవతి కావడంతో సుహాసిని భర్త హరిసింగ్ అతడితో పాటు సమీప కుటుంబ సభ్యులు కొందరు కలిసి ఇప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని ఈసారి కూడా ఆడపిల్ల జన్మిస్తే ఇబ్బందిగా ఉంటుందని ఎలాగైనా మగ సంతానం కావాలని భావించారు. దీంతో వారందరూ కలిసి సుహాసినిని సూటిపోటి మాటలతో వేధించారు. అంతేకాకుండా మగ సంతానం కలగకపోతే హరిసింగ్‌కు మరో మహిళతో వివాహం చేస్తామని బెదిరించారు. అంతేకాకుండా సుహాసినిపై స్కానింగ్ చేయించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలితే అబార్షన్ చేయించుకోవాలని ఆమెను బలవంతంగా ఒప్పించారు. దీంతో జూన్ 24న భర్త హరిసింగ్‌తో పాటు కొందరు కుటుంబ సభ్యులు కలిసి ఎంజీనగర్‌తండాకు చెందిన దేవత్ క్రిష్ణ ఆటోలో కోదాడకు తీసుకెళ్లారు. అక్కడ విజయ ఆస్పత్రిలో డాక్టర్ గుర్వయ్య వద్ద స్కానింగ్ చేయించారు. స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలటంతో అబార్షన్ చేయించాలని హుజూర్‌నగర్ లోని కమల ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆస్పత్రిలో కాంపౌండర్‌గా పనిచేసే షేక్ ఖాసిం, ఆర్ఎంపీ అమరగాని నవీన్, హుజూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న దేవరకొండ రాణి కలిసి సుహాసినికి అబార్షన్ చేసే ప్రక్రియను ప్రారంభించారు. కొంత సమయం తర్వాత సుహాసిని ఆరోగ్యం సరిగా లేకపోవడంతో భయంతో ఖాసిం మెరుగైన చికిత్స కోసం ఆమెను వేరే ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో సుహాసినిని కోదాడలోని విజయ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడి కాంపౌండర్లు గోపి, సైదులు చికిత్సచేశారు. రాత్రి సమయం ఆస్పత్రిలో ఉన్నప్పటికీ సుహాసిని ఆరోగ్యం విషమంగానే ఉంది. ఉదయం సమయంలో ఆమెను పరీక్షించిన డాక్టర్ గుర్వయ్య ఖమ్మం తీసుకెళ్లాలని సూచించాడు. వెంటనే జూన్ 26న సుహాసినిని ఖమ్మంలోని ప్రశాంతి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమెను పరీక్షించిన వైద్యురాలు పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడినుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్తుండగా సూర్యాపేట సమీపంలోకి రాగానే సుహాసిని పరిస్థితి మరింత విషమించింది. చేసేది లేక సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే సుహాసిని మృతి చెందిందని డాక్టర్ తెలిపాడు. విషయం తెలుసుకున్న మృతురాలి తండ్రి భట్టు క్రిష్ణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఈ ఘటనలో సుహాసినికి స్కానింగ్ చేసి తర్వాత అబార్షన్ చేయించి ఆమె మృతికి కారకులైన భర్త హరిసింగ్, స్కానింగ్ కేంద్రం నిర్వాహకుడు గుర్వయ్య, కాంపౌండర్లు ఖాసిం, ఆర్ఎంపీ నవీన్, నర్సు రాణి, గోపి, సైదులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుతం గుర్వయ్య పరారీలో ఉండగా మిగిలిన ఆరుగురిని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ కేసులో సమగ్ర విచారణ చేసి బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో డీఎస్పీ జీ రవి, సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, చివ్వెంల ఎస్ఐలు వెంకటరెడ్డి, రువ్వ కనకరత్నం, సిబ్బంది నేలపట్ల శ్రీనివాస్, భూపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నాగమ్మ ఉన్నారు.


సూర్యాపేటలో విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

హాస్టల్‌లో ఉండటం ఇష్టలేక విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

దేవరకొండ, జూలై 1: ఆశ్రమ పాఠశాలలో ఉండడం ఇష్టంలేక 7వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన విద్యార్థినులు వార్డెన్‌కు సమాచారం ఇవ్వడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. సోమవారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం తెల్‌దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. హాస్టల్ వార్డెన్ రమణమూర్తి, విద్యార్థినులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దఅడిశర్లపల్లి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుర్గయ్య, సరిత దంపతుల కుమార్తె స్వాతి అదేమండలంలోని అంగడిపేటలో ఒకటవ తరగతి నుంచి 6వ తరగతి వరకు చదివింది. 7వ తరగతిలో అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోగా తెల్‌దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో అడ్మిన్ రావడంతో జూన్ 27వ తేదీన చేరింది. ఒకటే రోజు ఉండి జూన్ 28వ తేదీన పుస్తకాలు తెచ్చుకుంటానని చెప్పి వెళ్లింది. సోమవారం ఉదయం 10 గంటలకు తండ్రి దుర్గయ్య స్వాతిని బైక్‌పై తీసుకుని తీసుకొని తెల్‌దేవరపల్లి ఆశ్రమ పాఠశాల వద్దకు తీసుకువచ్చి వార్డెన్‌కు అప్పగించాడు. కాగా స్వాతి అప్పటికే ఇంటి వద్ద తండ్రి వ్యవసాయ పనులకు ఉపయోగించే క్రిమిసంహారక మందును బ్యాగులో వెంట తెచ్చుకుంది. తండ్రి వెళ్లిన 10 నిమిషాలకే తరగతి గదిలోనే స్వాతి క్రిమిసంహారక మందు తాగి అస్వస్థతకు గురైంది. గమనించిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాటు వార్డెన్ రమణమూర్తికి చెప్పడంతో ఆయన తండ్రి దుర్గయ్యతోపాటు 108 వాహనానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దేవరకొండ నుంచి 108 వాహనం సకాలంలో చేరుకుని బాలికను దేవరకొండ ఆసుపత్రికి తరలించారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో చికిత్స అందించడంతో బాలిక స్వాతి ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్ తెలిపారు. తెల్‌దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఉండి చదువుకోవడం ఇష్టం లేకనే స్వాతి ఆత్మహత్యయత్నం చేసిందని ప్రధానోపాధ్యాయుడు రమణమూర్తి, స్వాతి బంధువులు తెలిపారు. కాగా తెల్‌దేవరపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని తరగతి గదిలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యయత్నం చేసిందన్న విషయం సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈ ఘటనపై తన పొరపాటు ఏమీ లేదని హాస్టల్ వార్డెన్ రమణమూర్తి తెలిపారు. బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. తెల్‌దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో 3 నుంచి 10 తరగతులు ఉండగా, 200 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ఘటనపై వివరణ కోరేందుకు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.


దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని స్వాతి

పిచ్చికుక్క దాడిలో పలువురికి తీవ్రగాయాలు

తిరుమలగిరి(సాగర్), జూలై 1: పిచ్చికుక్క దాడిలో ఆరుగురు వ్యక్తులతో పాటు 30 మూగజీవాలకు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో డొక్కలబావితండాలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లేపల్లి నుంచి జీవనోపాధి కోసం ఇత్తడి పాత్రలు చేసుకునే కొందరు ఇటీవల డొక్కలబాయికి వచ్చారు. ఈ క్రమంలో వారు డేరాల్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒక్కసారిగా పిచ్చికుక్క ఎండీ హీనా, ఎండీ మహబూబ్, హుస్సేన్, జీజా అనే వ్యక్తులపై దాడి చేసింది. అనంతరం ఇంట్లో నిద్రిస్తున్న ఘంసీ, దూర్యా, జగన్‌లను కూడా గాయపరిచింది. అదేవిధంగా పలు ఇళ్లలోకి వెళ్లి సుమారు 30 మూగజీవాలను కరవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో గాయపడిన వారిని హాలియాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన చికిత్స కోసం పలు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. అయితే మూగజీవాలపై కుక్క దాడితో సంబంధిత రైతులు తమ జీవాలు చనిపోతాయన్న భయంతో అత్యవసర పశువైద్యం అందించే అంబులెన్స్ నెంబర్ 1962కు ఫోన్ చేసినా ఫలితం లకపోయింది. దీంతో చికిత్స కోసం స్థానిక రైతులు గోపాలమిత్రలకు సుమారు రూ.500 నుంచి రూ.1000వరకు సొంతంగా డబ్బులు ఇచ్చి వైద్యం చేయించారు. ఈ విషయమై మండల పశువైద్యాధికారి కేశవ్ అజ్మీరాను వివరణ కోరగా మధ్యాహ్నం అనంతరం తమ వైద్యసిబ్బందిని తండాకు పంపించి మూగజీవాలకు చికిత్స చేయించినట్లు తెలిపారు.

యువతిని ఆశ్రమానికి తరలించేందుకు ఏర్పాటు

నల్లగొండ క్రైం, జూలై 1 : నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని నల్లగొండ టూటౌన్ పోలీసులు ఆశ్రమానికి తరలించేందుకు ఏర్పాట్లుచేస్తున్నారు. ఆదివారం రాత్రి యువతిని గమనించిన పోలీసులు ఆమె ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో మతిస్థిమితం కోల్పోయిందని గుర్తించి పోలీసులు జిల్లా కేంద్రంలోని సఖీ కేంద్రానికి తరలించారు. సఖి కేంద్రంలో కూడా ఆ యువతి తనకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు తడబడుతుండటం, ఒక్కోసారి ఒక్కోతీరుగా మాట్లాడుతుండడంతో ఆమెను సఖీ కేంద్రం నుంచి ఆశ్రమానికి తరలించేందుకు సిద్ధమయ్యారు. అందులో భాగంగా నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు చౌటుప్పల్, సూర్యాపేటలో ఉన్న ఆశ్రమాల నిర్వాహకులను సంప్రదిస్తున్నారు. యువతిని ఆశ్రమానికి తరలించి ఆమెకు సంబంధించిన బంధువుల ఎవరైనా వస్తే అక్కడి నుంచే అప్పగించేందుకు ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడుతున్నారు.

హరిహరులకు విశేష పూజలు

భువనగిరి అర్బన్, జూలై 1: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హరిహరులకు సోమవారం విశేష పూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పర్వతవర్థిని రామలింగేశ్వరుడికి, శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్ర రీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తును అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సమూర్తులకు పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు.వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 20,84,631ల ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.


శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు లక్ష్మీనరసింహశాస్త్రి మృతి



మఠంపల్లి, జూలై 1: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ప్రముఖ రంగ స్థల నటుడు, నాటక రచయిత, కవి, వేదపండితుడు, తెలుగుఉపాధ్యాయుడు సోమయాజుల లక్ష్మీనరసింహశాస్త్రి(88)ఆదివారం అర్ధరాత్రి స్వగృహంలో మృతి చెందారు. మండలకేంద్రంలోని వీవీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా 1965 నుంచి 1998 వరకు పనిచేశారు. నల్లగొండ పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే కల్యాణోత్సవంలో వరుసగా 30 ఏళ్ల పాటు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, ఏపీ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా తిరుమలగిరిలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మఠంపల్లిలోని కనకదుర్గ ఆలయానికి అధ్యక్షుడిగా ఉన్నారు. లక్ష్మీనరసింహశాస్త్రికి ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సతీమణి వరలక్ష్మి గత ఏడాది మృతి చెందారు. లక్ష్మీనరసింహశాస్త్రి మృతదేహంపై మట్టపల్లి దేవస్థాన ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌లతో పాటు పలువురు ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సారైనా 'దశ' మారేనా?

● వానాకాలం సీజన్‌పై ఆశలు పెట్టుకున్న రైతులు
● శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుతం 9.64 టీఎంసీలే .. పూర్తిస్థాయి సామర్థ్యం 80.5 టీఎంసీలు
● వర్షాభావంతో నిండని చెరువులు



అర్వపల్లి మండలం సీతారాంపురం వద్ద నీరులేకుండా ఉన్న మెయిన్ కాల్వ

సూర్యాపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ రెండో దశ నీటి విడుదల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌లో తప్పని సరిగా నీటి విడుదల ఉంటుందని రైతులు ఆశతో ఉన్నారు.సూర్యాపేట జిల్లాలో నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద హుజూర్‌నగర్ నియోజకవర్గం మొత్తం, కోదాడ నియోజవర్గంలోని నాలుగు మండలాలకు సాగునీరు అందుతుంది. అదేవిధంగా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాలకు,కోదాడలోని నడిగూడెం మండలం వరకు శ్రీరాంసాగర్ రెండవ దశ సాగునీరు లభిస్తుంది. గత యాసంగిలో ఎస్సారీఎస్పీ జలాలు, సాగర్ ఎడమ కాల్వ కింద 3,82,545 ఎకరాల్లో జిల్లాలో వరి సాగు చేశారు. వార బందీ ప్రకారం నీటి విడుదలతో చివరి ఆయకట్టుకు నీరు అందలేదు. 1800 క్యూసెక్కుల వేగంతో నీటిని విడుదల చేయడంతో చివరి ఆయకట్టు భూములకు నీరు అందలేదు. కేవలం మోకాలు ఎత్తులో మాత్రమే నీరు ప్రవహించింది. ఈ క్రమంలో నీరు అందక పలు మండలాల్లోని గ్రామాల్లో పొలాలు ఎండిపోయాయి.

కాల్వలకు ఆధునీకీకరణ లేక..

శ్రీరాంసాగర్ రెండో దశ నిర్మాణానికి 20ఏళ్ల క్రితం రూ.1100 కోట్లు కేటాయించి కాల్వలను తవ్వారు. జిల్లాలోని 2.44లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టు పనులు చేపట్టారు. రెండో దశ కాల్వలకు ఆధునికీకరణ పనులు చేయకపోవడంతో 50వేల ఎకరాలకు సాగునీరు అందడంలేదు. శ్రీరాంసాగర్ రెండో దశ నీటి విడుదల కోసం నిజామాబాద్ జిల్లాలోని కాకతీయ మెయిన్ కెనాల్ నుంచి నీటిని పంపింగ్ చేసి మహబూబాబాద్ జిల్లా మైలవరం రిజర్వాయర్‌కు అక్కడి నుంచి జనగాం జిల్లా కొడకండ్ల బయ్యన్నవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు పంపుతారు. అక్కడి నుంచి సూర్యాపేట జిల్లోని డీబీఎం-69, డీబీఎం-70,-71 డిస్టిబ్యూటర్లకు నీరు విడుదల చేస్తారు. డీబీఎం-69ద్వారా తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల మండలాల్లోని 170చెరువులకు నీటిని విడుదల చేస్తున్నా అంతంత మాత్రంగానే నీరు అందుతుంది. డీబీఎం-70 ద్వారా తిరుమలగిరి, నాగారం మండలాలకు పది కిలోమీటర్ల మేరకే నీరు అందుతుంది. దీనివల్ల అర్వపల్లి, ఆత్మకూర్(ఎస్), మోతె మండలాల్లోని పలు గ్రామాల్లో పంటలు ఎండిపోయాయి. డీబీఎం-71 ద్వారా సూర్యాపేట, చివ్వెంల, పెన్‌పహాడ్, నడిగూడెం మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. గత యాసంగి సీజన్‌లో పలు మండలాల్లోని గ్రామాల్లో రైతులు సరాసరి ఐదు ఎకరాల్లో సాగుచేస్తే మూడు ఎకరాల వరకే సాగునీరు అందింది. రెండు ఎకరాలు ఎండిపోయాయి. ఈసారీ కూడా సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. చెరువుల కింద ఆయకట్టు ఉన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేదు. అదే సమయంలో భూగర్భజలాలు ఉంటే బోర్లు, బావులు కింద పొలాలు సాగుచేసే అవకాశం ఉంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోనే అడుగంటిన జలాలు

శ్రీరాంసాగర్ పూర్తి నీటి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.643 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. దీనివల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై అనేక సందేహాలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తక్కువగా ఉండడంతో రెండో దశకు సాగునీరు అందించేది ప్రశ్నార్థకంగానే ఉంది.

నీటి విడుదలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు

శ్రీరాంసాగర్ రెండో దశ నీటి విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. మూడు సంవత్సరాల నుంచి వార బందీ పద్ధతిలో నీరువిడుదల చేస్తున్నాం.ప్రభుత్వ నిర్ణయం మేరకు నీటి విడుదలపై త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

- విజయ్‌కుమార్, ఈఈ

అంతంత మాత్రంగానే నిండిన చెరువులు

సూర్యాపేట జిల్లాలో 1340 చెరువులు ఉండగా చాలా చెరువుల్లో ఆశించిన స్థాయిలో నీరు లేదు. కొన్నింటిలో 30శాతమే నీరు ఉండగా, మరికొన్ని చెరువుల్లో 10శాతమే నీరుంది. అసలు నిండని చెరువులు కూడా ఉన్నాయి. జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో భూగర్భ జలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. జిల్లాలో 86.9మిల్లీ మీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 40.9 వర్షాపాతం మాత్రమే నమోదైంది. దీంతో రైతులు శ్రీరాంసాగర్ రెండవ దశ పైనే ఆశపెట్టుకొని సాగుకు సన్నద్ధమవుతున్నారు.



పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఎండిపోయిన చెరువు

వరుస దొంగతనాలతో భయాందోళన

దేవరకొండ, జూలై 1 : నల్లగొండ జిల్లా దేవరకొండలో మూడు రోజులకు ఒక్కసారి దొంగతనాలు జరుగుతుండడంతో స్థానికులు భయాందోళకు గురవుతున్నారు. ఇంటికి తాళంవేసి ఊరెళ్లాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పోలీసులు నిఘా ఏర్పాటు చేయకపోవడం, పెట్రోలింగ్ సక్రమంగా జరపకపోవడంతోనే చోరీలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి కల్వకుర్తి రోడ్డులోని రేణుక ఎల్లమ్మ వైన్స్‌షాపులో దొంగలు రూ.30వేల విలువైన మద్యం, డబ్బులు అపహరించారు. కాగా మే 19న అయ్యప్పనగర్‌కు చెందిన సుమలత ఇంటికి తాళంవేసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లింది. ఆమె ఇంటి తాళాలు పగలగొట్టి దొంగలు మూడు తులాల బంగారం, పట్టువస్త్రాలు, నగదును అపహరించారు. ఇరుగుపొరుగు వారు గమనించి సుమలతకు సమాచారం అందించడంతో సోమవారం దేవరకొండకు చేరుకున్న సుమలత వచ్చి చూడగా బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం, పట్టువస్త్రాలు అపహరణకు గురైనట్లు గుర్తించింది. దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపారు.

ఏబీవీపీ కార్యకర్తలపై నూతన చట్టం కింద కేసు



డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలను చుట్టుముట్టిన పోలీసులు

నల్లగొండ క్రైం, జూలై 1 : నూతన నేర చట్టాల ప్రకారం నల్లగొండ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తొలి కేసు నమోదైంది. సోమవారం నుంచి భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం నల్లగొండ జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వన్‌టౌన్ పోలీసులు ఏబీవీపీ నేతలను అదుపులోకి తీసుకుని నూతన చట్టం ప్రకారం 170 బీఎన్ఎస్ఎస్(ముందస్తు అరెస్టు) యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఏబీవీపీకి చెందిన 19 మంది నాయకులపై ప్రివెంటీవ్ అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ప్రాంతం

చందంపేట, జూలై 1 : నల్లగొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామంలోని చెంచుకాలనీలో ఆదివారం అర్థరాత్రి గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ సోమవారం తెలిపారు. తవ్వకాలు జరుపుతుండగా స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేశారు. నలుగురిలో ఇద్దరు స్థానికులకు పట్టుబడగా మరో ఇద్దరు పరారయ్యారు. స్థానికులు అప్పగించిన ఎడుపుల నగేష్, బొడ్డు అంజయ్యలతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా తవ్వకాలకు వినిగియోంచిన ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

108లో మహిళ ప్రసవం



శిశువును చూపిస్తున్న వాహన సిబ్బంది

తిరుమలగిరి(సాగర్)/ నాగార్జున సాగర్, జూలై 1: 108 వాహన సిబ్బంది గర్భిణికి పురుడుపోశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలో సోమవారం చోటుచేసుకుంది. జానారెడ్డికాలనీకి చెందిన జటావత్ విజయకు సోమవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే గ్రామానికి చేరుకున్న 108 అంబులెన్స్ విజయను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికంకావడంతో 108 ఈఎంటీ రాకేష్, పైలట్ కే శ్రీనులు అంబులెన్స్‌లోనే కాన్పు చేశారు. దీంతో విజయ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండడంతో వారిని నాగార్జునసాగర్ కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించారు.సకాలంలో స్పందించి ఎటువంటి ప్రమాదం జరగకుండా ప్రసవం చేసిన 108 సిబ్బందికి విజయ కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



నరేష్(ఫైల్)

గరిడేపల్లి, జూలై 1 : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో కుటుంబకలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం ఎస్ఐ ఈట సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గరిడేపల్లికి చెందిన పెండెం నరేష్(40)కు అదే గ్రామానికి చెందిన మేకపోతుల స్వప్నతో 12 ఏళ్ల కిందట వివాహమైంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో వేర్వేరుగా ఉంటున్నారు. జూన్ 19న భార్య స్వప్న, అత్తామామలు సైదులు, అంజమ్మలు నరేష్ ఇంటికెళ్లి విడాకుల నోటీస్‌పై సంతకం పెట్టాలని దాడి చేశారు. దీంతో నరేష్ మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకున్నాడు. సోమవారం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపారు. నరేష్ తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సైదులు తెలిపారు. నరేష్, స్వప్న దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



నాగార్జునసాగర్, జూలై 1: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ కొత్తవంతెన ఏపీ వైపున 4వ నెంబరు పిల్లర్ వద్ద కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. 65 నుంచి 70 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహంపై ముదురు ఆకుపచ్చ చారలు గల లేత ఆకుపచ్చ టీషర్ట్, నీలి, కాఫీ రంగు గడులు గల లుంగీ ఉందని, మెడకు తెల్లని కట్టు ఉందని ఎస్ఐ తెలిపారు. మృతుడి రెండు కాళ్లు విరిగిపోయి ఉన్నాయని ఆనవాళ్లు తెలిసిన వారు ఫోన్ 9440900884, రైట్ బ్యాంక్ పోలీస్‌స్టేషన్ నెంబరు 08642278219, మాచర్ల సీఐ 9440796229 నెంబర్లను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఉడకని అన్నం, చెంచా కూర

● తినలేక కడుపు మాడ్చుకుంటున్న విద్యార్థులు



గడ్డలు గడ్డలుగా ఉన్న అన్నం, అందులో వేసిన చిన్న చెంచా కూర, 200 మంది విద్యార్థులకు వండిన దోసకాయకూర

మోత్కూరు, జూలై 1: ఉడకని అన్నం, చెంచా కూర, నీళ్ల మజ్జిగతో సరిపెట్టుకోలేక అర్థాకలితో ఉంటున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు. పాఠశాలలో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందడంలేదు. ఇదేమని ప్రశ్నిస్తే తమ పిల్లలను బెదిరిస్తున్నారని తల్లి దండ్రులు వాపోతున్నారు. ఇంతకన్నా మీ ఇళ్ల వద్ద బాగా తింటారా అంటున్నారని ఆవేదన చెందుతున్నారు.

అసౌకర్యాల మధ్య పాఠశాల

గురుకుల పాఠశాల వడ్డెరకాలనీ పక్కన ఉన్న సత్యంగౌడ్‌కు చెందిన అద్దె బిల్డింగ్‌లో కొనసాగుతోంది. ఇందులో 202 మంది విద్యార్థులు ఉన్నారు. సోమవారం తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాఠశాలను సందర్శించిన సమయంలో పరిస్థితి ఇలా ఉంది. అన్నం సరిగా ఉడకక గింజలు గింజలుగా, గడ్డలు, గడ్డలుగా ఉంది. కొద్దిమేర దోసకాయ కూర వడ్డించారు. అదీ కూడా నీళ్లనీళ్లగా ఉంది. ఒక్కో విద్యార్థికి సగం గరిట కూర వేసి చారుపోసుకుని తినమని పంపిస్తున్నారు. చారు, మజ్జిగ పూర్తిగా నీళ్లలా ఉంది. 202 మంది విద్యార్థులకు మూడు కిలోల పెరుగు తెచ్చి నీళ్లు కలిపి పోస్తున్నారు. కూరగాయల కాంట్రాక్టర్ తక్కువ ధరకు దొరికే, వాడిపోయిన, పాడైన కూరగాయలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వాటితో వండిన కూరలు రుచీపచీ ఉండడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. అన్నం, కూర, చారు, మజ్జిగ బాగా లేవంటే తమను తిడుతున్నారని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాలు బయట చెప్పవద్దని బెదిరిస్తున్నారని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు అధ్వానం

గురుకుల పాఠశాలలో కనీస వసతులు లేవు. భోజనశాలపై రేకుల షెడ్ పైకప్పు రేకులు లేచిపోయాయి. విద్యార్థులు నేలపై కూర్చుని భోజనం చేస్తున్నారు. పాఠశాల ప్రహరీ కూలిపోవడంతో కుక్కలు, పందులు ఆవరణలోకి వస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయి.

ఇదిలా ఉండగా పాఠశాలలో అధ్వాన పరిస్థితులపై ప్రిన్సిపాల్ వెంకటస్వామిని వివరణ కోరడానికి ప్రయత్నించగా ఆయన పాఠశాలలో లేరు. ఈరోజు టెండర్ల ప్రక్రియ ఉండడంతో భువనగిరికి వెళ్లినట్లు సిబ్బంది తెలిపారు. ఫోన్‌లో సంప్రదించగా కాంట్రాక్టర్ తాజా కూరగాయలు సరఫరా చేయడం లేదన్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదన్నారు. మెనూ ప్రకారం భోజనం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించగా ఆయన సమాధానం ఇవ్వలేదు.

ఇంటి భోజనం తెచ్చి తినిపిస్తున్నాం



తన పిల్లాలకు ఇంటి నుంచి తెచ్చిన భోజనం తినిపిస్తున్న తండ్రి దోమల బిక్షం

నా ఇద్దరు పిల్లలు ఈ పాఠశాలలోనే చదువుతున్నారు. ఇక్కడ భోజనం బాగుండటం లేదని ఎన్నిసార్లు చెప్పినా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదు. పిల్లలు భోజనం బాగాలేదని పాఠశాలను వదిలి రాకుండా ఉండేందుకు వారం, 10 రోజులకు ఒకసారి ఇంటి నుంచి భోజనం తెచ్చి తినిపించి వెళ్తున్నా. మెనూ ప్రకారం భోజనం అందించాలి. లేకుంటే ఆందోళన చెపడతాం.

- దోమల బిక్షం, గ్రామం, చిత్తాపురం

విద్యుదాఘధాతంతో వ్యక్తి మృతి



నర్సింహారావు(ఫైల్)

హుజూర్‌నగర్, జూలై 1: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విద్యుదాఘాతంతో మార్బుల్ కార్మికుడు మృతి చెందాడు. ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం రాయినిగూడెం ప్రాంతానికి చెందిన ఉలవలపురి నర్సింహారావు(40) భవన కార్మికుడిగా, మార్బుల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా జూన్ 29న అతడి మేస్త్రి ధారా శ్యామ్‌తో కలిసి పట్టణంలోని చింతకాయల కోటయ్య ఇంట్లో మార్బుల్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు మిషన్ హ్యాండిల్‌కు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. కాగా ఆ సమయంలో మిషన్ నర్సింహారావు మీద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే హుజూర్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కాగా నర్సింహారావు భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బారసాలకు వచ్చి..



బాలాంజలి(ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్ : అక్క కుమారుడి బారసాల వేడుకకు వచ్చిన ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. సోమవారం యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లిలో ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గౌరాయిపల్లి గ్రామానికి చెందిన వడ్లకొండ ప్రహ్లాద రెండవ కుమార్తె భూపతి సుబ్బమ్మ అలియాస్ బాలాంజలి(25)కి రాజాపేట మండలం పారుపల్లి గ్రామంలోని భూపతి నరేష్‌కు పదేళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం బతుకుదెరువు కోసం సికింద్రాబాద్ లాలాపేటలో కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. బాలాంజలి అక్కకు కుమారుడు పుట్టడంతో బారసాల కోసం మూడు రోజుల కిందట గౌరాయిపల్లికి వచ్చింది. ఉదయం ఇంట్లో నీటి సంపు వద్ద దుస్తులు ఉతుకుతుండగా విద్యుత్ మోటార్ వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

నాలుగు రోజులుగా ఇంట్లోనే మృతదేహం

● దుర్వాసన రావడంతో గుర్తించిన ఇరుగుపొరుగు ● ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు



సత్తమ్మ(ఫైల్ ఫొటో)

మోత్కూరు, జూలై 1: ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు మృతిచెంది నాలుగు రోజులైంది. ఆమె ఊరికి వెళ్లినప్పుడు చూసిన వారు అక్కడే ఉందని అనుకున్నారు. ఆ ఇంటి ద్వారానికి ఎప్పుడూ పరదా ఉంటుంది. ఇంటి పరిసరాల్లో ఎవరూ ఉండకపోవడంతో ఎవరూ పట్టించుకోలేదు. నాలుగు రోజుల తర్వాత ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో అనుమానించిన వారు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి వృద్ధురాలి మృతదేహం కుళ్లిపోయి ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు పట్టణంలో సోమవారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. పట్టణవాసులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరుకు చెందిన ముద్రబోయిన సత్తమ్మ(65) మోత్కూరులోని పాతబస్టాండ్ సమీపంలో ఒంటరిగా ఉంటోంది. చాలా ఏళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఆమె అస్తమాతో బాధపడుతోంది. ఇద్దరు కుమారులు ఉండగా, ఒక కుమారుడు హైదరాబాద్‌లో, మరో కుమారుడు మోత్కూరులో ఉంటున్నాడు. మోత్కూరులో ఉన్న కుమారుడు, కోడలు అప్పుడప్పుడు వచ్చి ఆమెను చూసి వెళ్తారు. నాలుగు రోజుల క్రితం సత్తమ్మ ఊరికి వెళ్లింది. ఆమె వెళ్లడం చూసిన ఇరుగుపొరుగు వారు ఆమె తిరిగి రావడాన్ని గమనించలేదు. ఆమె ఇంటి ద్వారానికి పరదా(కర్టెన్) వేసి ఉంటుంది. ఊరికి వెళ్లి తిరిగి వచ్చిన ఆమె ఇంట్లోనే మృతి చెందింది. ఇరుగుపొరుగు ఆమె ఊరికి వెళ్లిందనే అనుకున్నారు. ఆదివారం సాయంత్రం ఆ ఇంటి వైపు నుంచి దుర్వాసన రావడంతో ఇరుగుపొరు గు ఆ ఇంటి చుట్టు చూడడంతో అక్కడ ఓ పందికొక్కు చచ్చి పడి ఉంది. అదే వాసన వస్తుందనుకుని దానిని తీసేశారు. అయినా సోమవారం కూడా దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన ఇరుగు పొరుగు ఇంటి వద్దకు వెళ్లి కర్టెన్ తొలగించి చూసే సరికి ఇంటికి తాళం లేదు. తలుపులు తెరిచిచూడగా సత్తమ్మ మృతిచెంది మృతదేహం కుళ్లిపోయి ఉంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని ఇరుగుపొరుగును విచారించారు. ఆమె అస్తమా వ్యాధితో మృతి చెంది ఉంటుందని భావిస్తున్నారు. వైద్యులను ఇక్కడకు పిలిపించి పోస్టుమార్టం నిర్వహించారు. చిన్న కోడలు లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వృద్ధురాలి అంత్యక్రియలు నిర్వహించారు.

అతివేగంతో కారు ఢీకొని వ్యక్తి మృతి

మునగాల, జూలై 1 : నడుచుకుంటూ వెళ్తున్న వారిపైకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా మునగాలలో సోమవారం జరిగింది. ఎస్ఐ అంజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన గజేంద్ర(26), లచిన్ సూర్యాపేటకు చెందిన బోర్ బండి మీద పనిచేస్తున్నారు. బోర్‌బండి తాడ్వాయి పెట్రోల్ బంక్‌లో ఆపారు. ఈ క్రమంలో వీరిద్దరూ సేద తీరేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటు వెళ్తున్న సమయంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు అతివేగంగా అదుపుతప్పి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గజేంద్ర ఎగిరి కల్వర్టులో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. లచిన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం గజేంద్ర మృత దేహాన్ని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బోరు బండి ఓనర్ భాస్కర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగ అరెస్టు

నేరేడుచర్ల, జూలై 1 : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణ పరిధిలోని పాత ఇనుము దుకాణంలో జూన్ 29న చోరీకి సంబంధించిన కేసులో దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రవీంద్రనాయక్ సోమవారం తెలిపారు. హైదరాబాద్‌కు తాళ్లూరి కనకాచారి వివాహం చేసుకొని మిర్యాలగూడ సీతారాంపురంలో నివాసం ఉంటున్నాడు. హుజూర్‌నగర్ రోడ్డులో పాత ఇనుము దుకాణంలో చోరీకి పాల్పడ్డట్లు తెలిపారు. సోమవారం నేరేడుచర్లలో వాహనాలు తనిఖీచేస్తుండగా దొంగలించిన బైక్‌తో వస్తుండగా అనుమానంతో విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ. 25వేల నగదుతో పాటు మిర్యాలగూడ, సరూర్‌నగర్‌లలో దొంగలించిన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇతడిపై హైదరాబాద్, సరూర్‌నగర్, మిర్యాలగూడ పట్టణాల్లో కేసులు ఉన్నట్లు తెలిపారు.

కోడి పందెం స్థావరంపై దాడి: అరెస్ట్

మిర్యాలగూడ రూరల్, జూలై 1 : కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి జరిపి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని శ్రీనవాస్‌నగర్ గ్రామశివారులో సోమవారం జరిగింది. రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శ్రీనివాస్‌నగర్, దుబ్బతండా గ్రామ శివారులోని గురుకుల పాఠశాల వెనుక చెట్ల కింద కొందరు కోడిపందాలు ఆడుతున్నారని సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడి చేసి కటారి గోపికృష్ణ, మానిపాటి సుంకయ్య, ఎస్‌కె.బడేసాహెబ్‌లను అరెస్ట్ చేశామన్నారు. మరికొందరు తప్పించుకున్నారని తెలిపారు. ఒక కోడి పుంజు, నాలుగు మొబైల్ ఫోన్స్, నాలుగు బైక్‌లు, ఆటో, రూ.2900 నగదును స్వాధీనం చేసుకున్నామని, పట్టుబడిన వారిని అరెస్ట్ చేసి చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

వేములపల్లి, జూలై 1: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం మొల్కపట్నం గ్రామశివారులో సోమవారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. బాధితుడు కడకండ్ల చినరాములు తెలిపిన వివరాల ప్రకారం రోజు మాదిరిగానే గేదెను మేతకు తీసుకెళ్లగా గ్రామ శివారులోని విద్యుత్ స్తంభం వైర్‌కు గేదె తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందిందింది. గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని, విద్యుత్ శాఖ అధికారులు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు. విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పేరెల్లి నగేష్ ఘటనా స్థలాన్ని సందర్శించి, బాధితుడిని పరామర్శించారు.

విద్యుత్ శాఖకు బకాయిల షాక్

● చేతివృత్తిదారులకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ ● రూ.7.14 కోట్ల మేర విద్యుత్ శాఖపై భారం ● వినియోగదారుల్లో బిల్లుల్లో ఎరియర్స్‌గా నమోదు

చేతి వృత్తిదారుల యూనిట్లకు అందిస్తున్న ఉచిత విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. పథకం ప్రారంభంలో అందించిన అరకొర నిధులే తప్ప ఇప్పటివరకూ పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాలేదు. దీంతో వినియోగదారుల బకాయిలను బిల్లుల్లో ఎరియర్స్ చూపిస్తుండగా, బకాయిల భారం విద్యుత్ శాఖపై నెలనెలా పెరిగిపోతోంది. అదేకాకుండా కొత్త ప్రభుత్వం ఏర్పాటైన గత ఏడాది నవంబరు నుంచి నేటి వరకు ఒక్క రూపాయి విడుదల కాలేదు. దీంతో చేతివృత్తిదారులకు చేయూత ఉంటుందని అందిస్తున్న ఉచిత విద్యుత్ అమలుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.


-నల్లగొండ టౌన్

బీసీ కార్పొరేషన్ ద్వారా రజకులకు, నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం అండగా నిలవాలన్న ఉద్దేశ్యంతో వాషర్‌మన్, హెయిర్‌కటింగ్ సెలూన్లకు అమలుజేస్తున్న 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని తీసుకువచ్చింది. అప్పటి సీఎం కేసీఆర్ గత ఏడాది మార్చిలో ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. లబ్ధిదారుల ఎంపికను బీసీ కార్పొరేషన్‌కు అప్పగించి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించి అర్హులైన వారి జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. అప్పటి నుంచి వాషర్‌మన్, హెయిర్‌కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలో మొత్తం 7,276 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 5,572 వాషర్‌మన్లకు సంబంధించి, 1,704 హెయిర్‌కటింగ్ సెలూన్లు ఉన్నాయి. వీరందరికీ ప్రతి నెలా 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. వీటికి తోడు నాలుగు నెలలుగా జిల్లాలో 2.48 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులకు కూడా 200 యూనిట్ల వరకు ఉచిత అందిస్తున్న విషయం తెలిసిందే.

రూ.7.14 కోట్ల బకాయిలు

చేతి వృత్తిదారులకు సంబంధించిన ఉచిత విద్యుత్ పథకానికి నిధులు కొరత వేధిస్తోంది. పథకం ప్రారంభంలో ప్రభుత్వం కొద్దిమొత్తంలో నిధులు విడుదల చేసినప్పటికీ ఆ తర్వాత అడపాదడపా నిధులు విడుదలచేయడంతో అవి బకాయిలకు కూడా సరిపోవడం లేదు. గత ఏడాది నవంబరు నుంచి ఇప్పటివరకు ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా కోట్లలో బకాయిలు పేరుకుపోయాయి. ఫలితంగా వినియోగదారులకు నెల నెలా జారీ చేసే బిల్లుల్లో వేల రూపాయల ఎరియర్స్‌గా చూపిస్తున్నారు. ప్రతినెలా సుమారు రూ.65 లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు పేర్కొంటుండగా ఇందులో ఏ నెలా పూర్తి నిధులు విడుదల కాకపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ఇప్పటివరకు గడిచిన రెండేళ్లలో రూ.7,14,00016 బకాయిలున్నాయి. ఇందులో హెయిర్‌సెలూన్లకు సంబంధించి గత ఏడాది రూ.75.63 లక్షలు, ఈ ఏడాది రూ.19.03 లక్షలు మొత్తం రెండేళ్లలో రూ.94.66 లక్షల బకాయిలున్నాయి. ఇక వాషర్‌మన్‌ల విషయానికొస్తే గత ఏడాది రూ.5.22 కోట్ల బకాయిలుండగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ. 96.76 లక్షలు మొతం కలిపి పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు రూ.6,19,50,000 బకాయిలున్నాయి. గత ప్రభుత్వం కొన్ని నిధులు విడుదల చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నవంబరు నుంచి ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు.

నిధులు విడుదల కావాలి



జిల్లాలో వాషర్‌మన్, హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచిత విద్యుత్ అమలు జరుగుతోంది. అయితే ప్రభుత్వం నుంచి నిధులు సకాలంలో రానందున బకాయిలు ఉన్న మాటా వాస్తవం. కానీ, ప్రభుత్వం విడుతల వారీగా నిధులు విడుదల చేస్తోంది. రాష్ట్ర స్థాయిలో నిధులు రావాల్సి ఉంటుంది. నిధులు రాగానే వినియోగదారుల బకాయిలను జమచేస్తాం. అంతేతప్ప ఎవరినీ బిల్లులు చెల్లించాలని చెప్పడం లేదు.

-చంద్రమోహన్, ఎస్ఈ

దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలి

● అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ప్రజావాణిలో దరఖాస్తుదారులు చేసుకున్న అర్జీల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్ అన్నారు. జిల్లాలోని మాడ్గులపల్లి, మిర్యాలగూడ, తిప్పర్తి, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో వారు పాల్గొని అర్జీలను స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి రికార్డు రాయాలని సూచించారు. ప్రజావాణి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. మండలస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మాత్రమే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

●మాడ్గులపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. ఎంపీడీవో తిరుమలస్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మ, ఏపీవో శ్రీనివా‌స్‌రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరి (సాగర్)లో అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

● మిర్యాలగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో దరఖాస్తుదారులు చేసుకున్న అర్జీల సమస్యలను వెంటనే సత్వరమే పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిశర్మ, తహసీల్దార్ హరిబాబు, ఆయా శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● తిప్పర్తి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర పాల్గొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భూమన్న, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ స్వప్న, అధికారులు, పాల్గొన్నారు.

● తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే మండల, గ్రామస్థాయిలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస‌రావుతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు ప్రధానంగా భూ సంబంధిత సమస్యలపై అధికారులకు దరఖాస్తులను అందజేశారు. వాటిని స్వయంగా పరిశీలించిన అదనపు కలెక్టర్ మండలంలో కృష్ణపట్టి ప్రాంతంలోని చింతలపాలెం, నెల్లికల్, నాగార్జునపేట, జమ్మనకోట, తిమ్మాయిపాలెం తదితర గ్రామాల రైతులు తాము ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. పలువురు రైతులు కబ్జాలో ఉంటూ ప్రభుత్వ భూములను సేద్యం చేసుకుంటున్నా తమకు పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదని అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే మండలంలో భూముల సర్వే చేసేందుకు, ధరణి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దశల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అదేవిధంగా నాగార్జునపేట తండా, జమ్మనకోట గ్రామాలకు సంబంధించి రెవెన్యూ, ఫారెస్ట్ సరిహద్దు సమస్య ఉన్నందున దాని కోసం సంబంధిత శాఖల అధికారులతో సర్వే నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భగవాన్‌నాయక్, ఎంపీడీవో రమేష్, ఇన్‌చార్జి తహసీల్దార్ నాగమణి, ఎంపీవో భిక్షంరాజు పాల్గొన్నారు.

● నిడమనూరు: ప్రజా సమస్యలను పరిష్కరించడానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 48 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుర్రం వెంకటేశం, తహసీల్దార్ కృష్ణయ్య, ఏవో కృష్ణయ్య పాల్గొన్నారు.

● దామరచర్ల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో పలువురు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజు దోపిడీని నియంత్రించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధీరావత్ లింగానాయక్ కోరారు. అర్హత లేని టీచర్లతో విద్యాబోధన నడిపే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై సర్వీస్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ధీరావత్ వినోద్‌నాయక్ కోరారు. ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, దయానంద్, బాలు పాల్గొన్నారు.

● మర్రిగూడ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీవో మున్నయ్య పాల్గొన్నారు. పలు సమస్యలపై 21 అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, నర్సింహ, రాజేష్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న డీడబ్ల్యూవో సక్కుబాయి



తిప్పర్తిలో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తుదారుడి సమస్యను తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ పూర్ణచంద్ర

● కేతేపల్లి మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ గ్రామాలకు చెందిన 27మంది పలు సమస్యలపై అర్జీలను అందజేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమాన్ని మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.మధుసూదన్‌రెడ్డి, ఏవో బి.పురుషోత్తం, ఐకేపీ యాదమ్మ, ఎంపీవో నాగలక్ష్మి, మూసీ కుడికాల్వ ఏఈ మమత, పీఆర్ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● అడవిదేవులపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 107దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో కరుణాకర్‌రావు తెలిపారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మండల అధికారులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి ప్రజావాణిలో ప్రజల నుంచి 60 దరఖాస్తులను స్వీకరించినట్లు ఎంపీడీవో రాంరెడ్డి తెలిపారు. ఇందులో రెవెన్యూకు సంబంధించి 17, ఎంపీడీవో పరిధిలోకి 43 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.

● చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని పలు గ్రామాల నుంచి 113 అర్జీలను స్వీకరించినట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీవో ప్రవీణ్, శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 22 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి విజయేందర్‌రెడ్డి, డీటీ సుకన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముస్తాఫా

నల్లగొండ టౌన్, జూలై 1: తమ న్యాయమైన హక్కుల సాధన కోసం తెలంగాణ మలిదశ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులంతా ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు షేక్ ముస్తాఫా పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కోర్టు ఎదుట గల జయశంకర్ పార్కులో సోమవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు ఉద్యమకా రులందరికీ 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని, ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని, కేసులు లేని ఉద్యమకారులను కూడా పరిగణలోకి తీసుకొని వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు 20శాతం వాటా అమలు చేయాలని కోరారు. జార్ఖండ్ ప్రభుత్వం లాగా, ఉద్యమకారులను గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం రాష్ట్ర, జిల్లా బాధ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నామిరెడ్డి నర్సింహారెడ్డి, ప్రధాన కా ర్యదర్శిగా మేడి విజయ్, జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకన్న, ప్రధాన కార్యదర్శులుగా జిల్లేపల్లి ఇంద్ర, తోట నర్సింహాచారిలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉ ద్యమకారులు దుబ్బ దేవేందర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, మార్య, శంకరయ్య, అప్పల మధు, నరేష్, వెంకన్న, రవి, కుడుతాల నాగయ్య, వంగూరు వెంకటేష్, రఫీ, విజయ్, పురుషోత్తం, ముజీబ్, చంద్రారెడ్డి, సతీష్‌కుమార్, ప్రవీణ్, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలి

● ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వేములపల్లి, జూలై 1: కాలానికి అనుగుణంగా విద్యార్థులకు ఉత్తమమైన బోధన విధానాన్ని అనుసరించి ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకాన్ని కల్పించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉర్దూ మీడియం పాఠశాలతో పాటు భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ప్రజాప్రతినిధులు, సమాజ సభ్యుల సహకారంతో విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఒప్పించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలోనే విద్యాబోధన చేస్తూ నాణ్యతా ప్రమాణాలను పాటించి తల్లిదండ్రుల ఆదరాభిమానాలను చూరగొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంఈవో బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి : బీఎల్ఆర్

వేములపల్లి, జూలై 1: అంగన్‌వాడీలను బలోపేతం చేసి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ, సీడీపీ నిధులు రూ.10లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని సోమవారం ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. త్వరలోనే అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు సైతం ఏకరూప దుస్తులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పుట్టల సునీత, జడ్పీటీసీ ఇరుగు మంగమ్మ, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, ఎంపీటీసీలు చైతన్య, పల్లా వీరయ్య, పీఏసీఎస్ చైర్మన్ జడ రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, డీసీసీ ఉపాధ్యక్షుడు రావు ఎల్లారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కాంతారెడ్డి, నాయకులు శ్రీను, శ్రీనివాస్, మధు, వినోద్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

'పదెకరాల వరకు రైతు భరోసా ఇవ్వాల్సిందే'

నిడమనూరు, వేములపల్లి, మర్రిగూడ, జూలై 1: ఐటీతో సంబంధం లేకుండా పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాల్సిందేనని మెజార్టీ రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లాలోని నిడమనూరు, వేములపల్లి, మర్రిగూడ మండలాల్లో పీఏసీఎస్‌లో నిర్వహించిన సమావేశాల్లో రైతు భరోసాపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఈ రోజుల్లో మూడు ఎకరాలు ఉన్న రైతులు కూడా తమ పిల్లల చదువుల కోసం రుణాలు తీసుకునేందుకు ఐటీ కడుతున్నారని గుర్తుచేశారు. పది ఎకరాల వరకు సాగుచేస్తున్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, గుట్టలు, కొండలు ఉన్న రైతులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే భూములకు రైతు భరోసా ఇవ్వవద్దని సూచించారు. కౌలు రైతులను గుర్తించి వారికి కూడా రైతు భరోసా ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర పెంచడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల ధరలు తగ్గించాలని కోరారు.

● నిడమనూరులో నిర్వహించిన సమావేశంలో డీసీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైతు భరోసాపై రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ విరిగినేని అంజయ్య, సీఈవో బుచ్చాల జానయ్య, ఏవో కృష్ణయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు గోవిందరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఈవోలు అనిల్, మహేష్, సమీ, కిషోర్, రైతులు కరుణాకర్‌రెడ్డి, భాస్కర్, వెంకన్న, కేవీటీ, అశోక్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● వేములపల్లిలో వేములపల్లి, సల్కునూరు పీఏసీఎస్ కేంద్రాల ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ జడ రాములుయాదవ్ రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతులందరికీ రైతు భరోసా కల్పించడంతో పాటు వరికి బోనస్ అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ పుట్టల సునీత, వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని, డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్, అధికారులు మహమ్మద్ అలీ, రాంబాయి, నాగమణి, రవీదర్‌రావు, నరేష్, సంతోష్, నితిన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

● మర్రిగూడ, నాంపల్లి మండల కేంద్రాల్లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో అధ్వర్యంలో చైర్మన్లు పందుల యాదయ్య, గట్టుపల్లి నర్సిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఏడీఏ ఎల్లయ్య రైతుల సలహాలు, సూచనలు ఆలకించారు. సమావేశంలో ఏవోలు హేమలత, రమేష్, రామనర్సయ్య, సత్తయ్య, డైరెక్టర్లు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నల్లగొండను అభివృద్ధిచేయడమే లక్ష్యం



మామిళ్లగూడెంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండరూరల్, జూలై 1: రానున్న నాలుగున్నరేళ్లలో నల్లగొండను రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండకూడదని, ఎక్కడైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.కోటి కేటాయించామని, అవసరమైతే మరిన్ని నిధులు ఇస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ, ఏఎమ్మార్పీ కాల్వల లైనింగ్, బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టులను పూర్తి చేయడమే తన ధ్యేయమని అన్నారు. నియోజకవర్గంతో పాటు, జిల్లా వ్యాప్తంగా అవసరమైన కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల షిఫ్టింగ్ వంటి వాటికి ప్రతిపాదనలు సమర్పిస్తే వారం, పదిరోజుల్లో మంజూరు చేయిస్తామన్నారు. అంగన్‌వాడీ సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకురావడంతో వారి సమస్యలను పరిష్కరిస్తామని, కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మిస్తామని అ న్నారు. ఎంపీపీ మనిమద్దె సుమన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏఎమ్మార్పీ ఎస్ఈ వెంకటేశ్వర్‌రావు, సీఈ నాగేశ్వరరావు, జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, తిరుపతయ్య జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, ఎంపీడీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంతోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణ పరిధిలోని మామిళ్లగూడెం ఎస్సీకాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, జడ్పీటీసీ లక్ష్మయ్యతో కలిసి ఆవిష్కరించారు. మామిళ్లగూడెంను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లు లేని వారందరికీ ఇళ్లు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, కాలనీకి సీసీ రోడ్డు వేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కంకణాల లక్ష్మమ్మ, నాయకులు దండంపల్లి వెంకన్న, జనార్దన్‌రెడ్డి, దాసరి శంకర్, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దాసరి విజయ్, ఉపాధ్యక్షుడు మర్రి పరమేష్, సభ్యులు దాసరి శ్రీకాంత్, పరశురాం, రమేష్ పాల్గొన్నారు.

వేతనాల కోసం జీపీ కార్మికుల ఆందోళన



మునిసిపల్ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులు

చండూరు, జూలై 1: చండూరు మునిసిపాలిటీలో పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. తమకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదంటూ సోమవారం ఆ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పారిశుధ్య కార్మికులు మాట్లాడుతూ తమకు 12 నెలలుగా పీఎఫ్ రావడం లేదని ఆరోపించారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్ వెంకటమణికరణ్‌ను వివరణ కోరగా రెండు నెలల జీతాలు సోమవారం వారి ఖాతాల్లో వేస్తామని, మిగతా రెండు నెలల జీతాలు ప్రభుత్వ నుంచి అనుమతులు రాగానే చెల్లిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో కార్మికులు అన్నెపర్తి వెంకన్న, నల్లగంటి లింగస్వామి, కత్తుల సైదులు, బిపంగి నాగరాజు, కళమ్మ, అలివేలు, చంద్రమ్మ, ఎల్లమ్మ, రవణమ్మ, జంగమ్మ, ముత్తమ్మ, రజిత, బక్కమ్మ, శ్రీరాములు, లక్ష్మమ్మ, కృష్ణయ్య, ఎల్లమ్మ, గండూరి వెంకన్న, యాదయ్య, రాజు, వెంకన్న పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ, జూలై 1: నీట్ ప్రశ్నపత్రం లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీట్ - 2024 ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీపై ప్రధాని మోదీ నేటి వరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. బీహార్‌లో రూ.34లక్షలకు ప్రశ్నాపత్రాన్ని విక్రయించినట్లు వార్తలు వచ్చాయన్నారు. 67 మంది మొదటి ర్యాంకులు రావడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. ఒకే సెంటర్ నుంచి పరీక్ష రాసిన 8 మంది విద్యార్థులకు 720 మార్కులు రావడం వెనుక పేపర్ లీకేజీ ఏ స్థాయిలో జరిగిందనేది అర్థమవుతుందని అన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, శంకర్, నాయకులు సైదానాయక్, జగన్, నుమాన్, వీరన్న, సంపత్, మణి, ప్రసన్న, సిపాయి అనిల్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి డిపోకు బస్సులను పంపిస్తాం : ఆర్ఎం

నార్కట్‌పల్లి, జూలై 1: నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోకు త్వరలోనే మరికొన్ని బస్సులను పంపిస్తామని నల్లగొండ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ అన్నారు. సోమవారం ఆయన నార్కట్‌పల్లి డిపో సందర్శించారు. తొలుత డిపో ఆవరణలో మొక్క నాటిన అనంతరం ఆయన గ్యారేజ్, బస్టాండ్, ఏడీసీ కార్యాలయాలను పరిశీలించారు. డిపోలో ఉన్న బస్సుల సంఖ్య, ఉద్యోగుల వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎం ఎంవీ.చారి, కర్నాటి శ్రీనివాస్, ఎల్‌సీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న కేవీ ప్రసాద్

శాలిగౌరారం, జూలై 1: సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతస్థాయిలో చేసినప్పుడే లయన్స్ క్లబ్‌లకు గుర్తింపు ఉంటుందని నల్లగొండ, ఖమ్మం, జిల్లాల రెండో వైస్ గవర్నర్ కేవీ ప్రసాద్ అన్నారు. శాలిగౌరారం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డెంకల సత్యనారాయణతో పాటు కార్యవర్గాన్ని ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. గ్రామీణ ప్రాంతంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడంలో శాలిగౌరారం క్లబ్ ముందంజలో ఉందన్నారు. పాస్ట్ గవర్నర్ గ్యాట్ అంబాసిడర్ లయన్స్ అమృతపెల్లి కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ తన హయాంలో ఏర్పడిన ఈ క్లబ్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చార్టర్ సభ్యులను, హాజరైన ప్రముఖులను శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి సింహాద్రి శివశంకర్‌రావు, కోశాధికారి తుమ్మలూరి మురళీధర్‌రెడ్డి, జీఎస్‌టీ కోఆర్డినేటర్ కోడే సతీష్‌కుమార్, జెల్లా దశరథ, బాచుపల్లి రవీందర్‌రావు, గుడిపూరి వెంకటేశ్వరరావు, అనంతరెడ్డి, ప్రసాద్, రావిరాల అశోక్, వెంకటరమణ, డాక్టర్ పుల్లారావు, శ్రీనివాస్, శంభులింగారెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి తదితలు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 1: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ చైర్మన్ భార్గవ్ కోరారు. మునిసిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజల సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమని, ప్రజలు వ్యర్థాలను మురుగుకాల్వలలో వేయకుండా తమ సిబ్బందికి అందించాలన్నారు. కమిషనర్ యూసుఫ్ మాట్లాడుతూ అత్యవసర సమావేశంలో మురుగుకాల్వల పూడికతీతకు రూ.30లక్షల కేటాయిస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో అధిక సంఖ్యలో అర్జీలు అందుతున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

నెల్లికల్ లిఫ్టు పనుల పరిశీలన

తిరుమలగిరి(సాగర్), జూలై 1: కృష్ణపట్టి ప్రాంతంలోని సుమారు 26 వేల ఎకరాలకు సాగునీరు అందించే నెల్లికల్లు లిఫ్టు పనులను సోమవారం సంబంధిత ఇంజనీర్లతో కలిసి ఎంపీపీ భగవాన్‌నాయక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రారంభమైన పనుల పురోగతి గురించి ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పంప్ హౌజ్‌కు సంబంధించిన స్టేజింగ్, సెంట్రింగ్, షట్టరింగ్‌తో పాటు 8వ లిఫ్టునకు సంబంధించిన కాంక్రీట్ పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పనులను పరిశీలించినట్లు ఎంపీపీ పేర్కొన్నారు. పనులు సకాలంలో పూర్తిచేసి రైతులకు కృష్ణా జలాలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఈలు వేణుగోపాల్, ప్రవీణ్‌కుమార్, ఇతర ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఇలియాస్‌ఖాన్

మిర్యాలగూడ, జూలై 1: మునిసిపల్ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా మహ్మద్ ఇలియాస్‌ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ మునిసిపల్ కౌన్సిలర్ల సమావేశంలో 8 మంది కౌన్సిలర్లు అశోక్‌నగర్ (23వ వార్డు) కు చెందిన కౌన్సిలర్ ఇలియాస్‌ను ఎన్నుకున్నారు. తన ఎన్నిక పత్రాన్ని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, కమిషనర్ యూసుఫ్‌లకు అందజేశారు. మునిసిపాలిటీలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారమయ్యే విధంగా చూస్తానని అన్నారు.

అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలి

నార్కట్‌పల్లి, జూలై 1: వ్యవసాయంలో అన్ని రకాల పంటలకు మద్దతు ధర కల్పించేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు శ్రీరామోజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇచ్చిన ధరలపై కేవలం 5శాతమే పెంచారని, ఇది రైతులకు ఏ మాత్రం లాభదాయకం కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చెర్కు పెద్దులు, నాయకులు చింతపల్లి బయ్యన్న, ఐతరాజు నర్సింహ, కుమ్మరి శంకర్, దండు రవి, యాదగిరిరెడ్డి, నాగరాజు, లింగారెడ్డి, లింగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నకిరేకల్: నకిరేకల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఆయా శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

చింతపల్లి: చింతపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొండూరి భవానీపవన్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుజాత తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగు సమాచారంతో పాల్గొనాలని సూచించారు.

త్రిపురారం: మిర్యాలగూడ సబ్‌స్టేషన్ 220 కేవీ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు త్రిపురారం మండలంలోని 33కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ నాగేశ్వ రవీందర్‌రెడ్డి తెలిపారు. మిర్యాలగూడ మండలంలోని అన్ని గ్రామాలు, త్రిపురారం మండలంలోని నాలుగు సబ్‌స్టేషన్లు త్రిపురారం, నీలాయగూడెం, మాటూరు, పెద్దదేవులపల్లి, ఫీడర్ల కింద ఉన్న అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీలోని రెండో వార్డుకు చెందిన పొన్నాల రాఖీ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయనకు ఎమ్మెల్యే వేముల వీరేశం ఆర్థికసాయం అందజేశారు. ఆయన పంపించిన రూ.10వేలను కాంగ్రెస్ నాయకులు రాఖీ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పోకల దేవదాస్, ఎద్దులపురి కృష్ణ, కోనేటి కృష్ణ, ఏర్పుల పరమేశం, సాగర్ల గోవర్ధన్, బొబ్బల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీ 10వ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఆధ్వర్యంలో కాలనీవాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వార్డులోని లోవోల్టేజీ, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

● యాదాద్రి భువనగిరి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఇన్‌చార్జిగా చిట్యాలకు చెందిన శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు.

వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు కుంచం రాము మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి పరామర్శించి రూ.20వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణంలోని పర్వత్‌రావు చెరువులో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని పర్వత్‌రావు చెరువు మాజీ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్ అన్నారు. పర్వత్‌రావు చెరువులో రోజు పదుల సంఖ్యలో టిప్పర్లు మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు.

అడవిదేవులపల్లి: మండలంలోని కొత్తనందికొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. తమ పిల్లలకు నాణ్యమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు గాదగోని మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ పకీరాపాల్గొన్నారు.

చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించాలని మండలంలోని అంగన్‌వాడీ సిబ్బంది కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేముల వీరేశానికి వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు అంగన్‌వాడీలు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు దాడి అరుణ, కొత్తపల్లి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

చందంపేట: సీపీఐకి ఇప్ప బాల్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. నేరేడుగొమ్ము మండలం తిమ్మాపురం గ్రామంలో బాల్‌రెడ్డి జ్ఞాపక స్థూపాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐకి అయన ఎనలేని సేవలు చేశారని, ఆయన ఆశయ సాధనకు కమ్యూనిస్టులందరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో నేరేడుగొమ్ము మండల కార్యదర్శి వెంకటయ్య, ఆంజనేయులు, రంగారెడ్డి, వెంగలయ్య తదితరులు పాల్గొన్నారు.

దామరచర్ల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీన నిర్వహించే మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సందాల శంభయ్య కోరారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 7వ తేదీన నియోజకవర్గంతో పాటు ప్రతీ మండలం, గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయడంతో పాటు ఆత్మగౌరవ కవాతు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు మచ్చ ఏడుకొండలు, సంద్ర నాగరాజు, ఆకారపు గోపాల్, కోట చంద్రబాబు, రమేష్‌బాబు, బంగారయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మర్రిగూడ: విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా సొసైటీ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని పీఏసీఎస్ చైర్మన్ యాదయ్య అన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన డైరెక్టర్లతో కలిసి పాల్గొని మాట్లాడారు. సొసైటీలో నిల్వ డబ్బులు లేనందున మన సొసైటీ ద్వారా రైతులకు ఎరువులు, యూరియా విక్రయాలను చేయలేక పోతున్నామని అన్నారు.

మిర్యాలగూడ: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్వదేశీ న్యాయ చట్టాలను రద్దుచేయాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య కోరారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. రాజ్యాంగబద్ధమైన పౌరహక్కులను హరిస్తున్న ఉపా, దేశద్రోహం లాంటి నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలని అన్నారు.

నకిరేకల్: నకిరేకల్‌లోని ఈ నెల 3వ తేదీన నర్రా రాఘవరెడ్డి భవన్‌లో నిర్వహించే నియోజకవర్గ సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు తెలిపారు.

మునుగోడు రూరల్: మండలంలోని ఊకొండి గ్రామ పాల సంఘం సొసైటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన కమ్మంపాటి జయమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.